# పొగడరా నీతల్లి భూమి భారతిని

ఒకబ్బాయి, ఒకమ్మాయి ప్రేమించుకున్నారు. అబ్బాయింకా జీవితంలో స్థిరపడలేదు. ఒంటికి పాతికేళ్ళ వయసు, చేతిలో ఆంధ్ర యూనివర్సిటీ ఆప్యాయంగా ఇచ్చిన అందమైన డిగ్రీ సర్టిఫికేటు ఉన్నాయి. అబ్బాయి బాగుంటాడు. అతని జుత్తు సహజంగా ఉంగరాలు, ఉంగరాలుగా ఉండటం వల్ల రోడ్డు మీద నడుస్తున్నప్పుడో, లేకపోతే సిటీ బస్సు ఎక్కినప్పుడో, లేకపోతే జగదంబా సెంటర్ దగ్గర నిలుచున్నప్పుడో ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒక అమ్మాయైనా అతనివేపు చూడక తప్పదు. దాని క్కారణం అతని జుత్తు కావచ్చు. అదే కాకుండా తెల్లగా స్వచ్ఛంగా మాయ తెలీని అతని కళ్ళు చురుగ్గా చూస్తుంటాయి. నవ్వితే అందమైన అమ్మాయి నవ్వినట్టుగా పసందుగా నవ్వగలడు. అంతేకాకుండా విట్టీగా మాట్లాడగలడు కూడా. అతన్తో ఒకసారి పరిచయమైన వాళ్ళు అంత వేగిరం అతన్ని వదిలిపోలేరు. దాని క్కారణం అదీ ఇదీ తెలీని ఏదో ఆకర్షణుంది అతనిలో.

అమ్మాయి కూడా బాగుంటుంది. సన్నగా, పొడవుగా ఉంటుంది. బాగా పండిన బంగినిపల్లి మామిడి పండు రంగులో ఆమె శరీరచ్ఛాయ ఉంటుంది. కోలగా ఉండే ఆ ముఖంలో విశాలమైన కళ్ళు ప్రబంధ కవులు ప్రబంధ సుందరిని వర్ణించేటట్టుగా కలువరేకుల్లా ఉంటాయి. కోటేరేసిన నాసిక అంటారు... అచ్చు అలాగే ఉంటుంది నాసిక. చిన్నినోరు. జలపాతంలా జాల్వారే జుట్టు ఆమె పిరుదుల వరకూ వ్రేలాడ్డం వలన ఎట్నించెటు చూసినా ఆ అమ్మాయి అందంగానే కన్పిస్తుంది. ఆ అమ్మాయి మాతృభాష తెలుగు కాకపోవడంవల్ల ,వచ్చీ రాని తెలుగు చిలకలా పలకడం వల్ల ఆ పలికే పలుకులు నిజంగా చిలక పలుకుల్లా అంచక్కగా ఉంటాయి. ఆ అమ్మాయికి నాట్యం వచ్చు. శాస్త్రీయంగా పాడగలదు కూడా.

అందుచేత అన్ని లక్షణాలున్న అమ్మాయి కనుకనే ఆ అబ్బాయి ఆమెను ఏరికోరి ప్రేమించాడంటే అది తప్పు. ఇద్దరి గురించి ఇద్దరికీ ఏం తెలీకుండా ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఆ అమ్మాయికీ మంచి ఆస్తి, ఏది కావాలన్నా క్షణమీ్మద తెచ్చిచ్చే తలిదండ్రులు, ఏ పని చెప్పినా 'అమ్మాయిగారికి కోపం తెప్పించకుండా' వెరీ వెరీ అర్జంటుగా చేసెయ్యడానికి సిద్ధంగా ఉన్న పనివాళ్ళూ, పాలకోవాలా మెరిసే కొత్త మేడా, సబ్బు బిళ్ళలా మిసమిసలాడే కారూ ఇలాంటివన్నీ ఆ అమ్మాయి కున్నాయని ఆ అబ్బాయికి తెలుసు. తను ఒకవేళ ఆ అబ్బాయిని కనుక పెళ్ళి చేసుకుంటే అతగాడి వెనుక స్కూటర్ మీదకాదు, కనీసం సైకిల్ వెనకాలైనా కూర్చో పెట్టలేడని, అమెరికన్ జార్జెట్ కాదు కనీసం ఖరీదైన వాయిల్ చీరైనా కొనిపెట్టలేడని, సినిమాకైనా కనీసం డీలక్స్‌లోకి తనని తీసుకెళ్ళలేడని, ఇంటర్వెల్‌లో కూల్‌డ్రింకులు ఇప్పించలేడని, క్యాడ్ బరీస్ చాక్లెట్లు తినిపించలేడని ఆ అమ్మాయికి తెలుసు.

అయినా వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు.

ప్రస్తుతం వాళ్ళిద్దరూ ఈ సమయంలో భీమునిపట్నం సముద్రానికెదురుగా, ఐస్ ఫ్యాక్టరీ దాటాక పర్లాంగు దూరం నడిస్తే వచ్చే సరుగుడు తోటలో, అటూ ఇటూ ఎవరికీ కనబడకుండా కాపలా కాస్తున్న ఎఱ్ఱమట్టి దిబ్బల మధ్య కూర్చున్నారు.

అమ్మాయి నీలం చీర కట్టుకుంది. అదే రంగు జాకెట్టు వేసుకుంది. అదే రంగు రిబ్బన్లు! అదే రంగు హెయిర్ పిన్నులు, అదే రంగు లాకెట్టు. అన్నీ ఎందుకు చెప్పడం. ఆ అమ్మాయి వేసుకున్నవన్నీ నీలం రంగువే. ఆ అమ్మాయికి నీలం రంగు ఇష్టమో కాదో నాకు తెలీదు కానీ ఆ సమయంలో ఆ అమ్మాయి ఎదురుగుండా కనబడే సముద్రం నీళ్లలోని నీలిమను తీసుకొచ్చి చేసిన స్వచ్ఛమైన నీలి నీలి బొమ్మలా అంచక్కగా మెరుస్తోంది.

మరి అబ్బాయి! అబ్బాయి మాత్రం మేచింగు వేసుకోలేదు. ఏదో కాఫీగుండ రంగు పేంటు మీద నల్లరంగుగీతల బుష్‌షర్టు వేసుకున్నాడు. ఆ షర్టుకి అక్కడక్కడా చిరుగు లున్నాయి. అతనికి ఉన్న వాట్లో అదొక్కటే మంచి జత. ఈ రెండు విషయాలూ ఆ అమ్మాయికి తెలీకుండా జాగ్రత్త పడుతున్నాడు ఆ అబ్బాయి.

గుంపుగా ఉన్న సరుగుడు చెట్ల మధ్య ఒక చెట్టుకి చేరబడి కూర్చుంది ఆ అమ్మాయి. ఆ అమ్మాయి ఒడిలో తలపెట్టుకుని ఇంకో ప్రక్కకి కాళ్ళు చాపుకునిఉన్నాడు అబ్బాయి.

వాళ్ళకి కొంచెం దూరంలో ఉన్న కొబ్బరిచెట్ల రెమ్మలు నవ్వలేక, నవ్వలేక నవ్వుతున్నాయా అన్నట్లు గాలికి ఉండుండి కదులుతున్నాయి. ఆ పక్కనే వెదురు పొద ఉండడం, దాని మీంచి వచ్చే గాలి, సన్నని పాట లాగా, ఆ పాటకి వాయించే ఫ్లూటు లాగా వినబడుతూంది.

కొంత సేపయాక ఆ అబ్బాయి –

"ఏమైనా చెప్పు. ఎందుకీ మవునం" అన్నాడు

"ఏం చెప్పను" అన్నదా అమ్మాయి.

"నే చెప్పనా?" అన్నాడా అబ్బాయి.

"వూ" అన్నది సున్నితంగా ఆ అమ్మాయి.

"నువ్వో ఆస్థి, అంతస్తూ, హోదా కలిగిన అమ్మాయివి. మరి నేను, ఇవేవీ లేని అనామకుణ్ణి" అన్నాడు.

"ఇలాంటి మాట మరోసారి అన్నావంటే నీతో నేను మాట్లాడను. తెలిసిందా" అన్నదా అమ్మాయి కించిత్తు కోపం అభినయిస్తూ.

"పోనీలే. అనన్లే. పోనీ మనది ఉత్తి ప్రేమేనా ఇంకేమైనా ఉందా."

"ఏమైనా ఉందాంటే."

"ఏమైనా అంటే మేరేజి ప్రపోజల్"

"పెళ్ళి చేసుకుందాం. దాని కేం. నువ్వు వేగిరం ఉద్యోగం సంపాదించేసుకో. నేన్నీతో వచ్చేస్తాను. అప్పుడు హాయిగా ఉండచ్చు" ఆ మాటలు ఆ అబ్బాయి కళ్ళల్లో ఎన్నెన్నో కొత్త కొత్త కాంతుల్ని నింపాయి. ఆ మాటలకు ఆ అబ్బాయి ఎంతో ప్రేమతో పొంగి పోయాడు.

"నిజంగా?"

"నిజం"

ఒక్కసారి అబ్బాయి ఆ అమ్మాయిని గట్టిగా వాటేసుకునిపట్టేసి బుగ్గ కొరికేశాడు. ఇంకేవేవో చేశాడు. అలా చెయ్యడం అమ్మాయికిష్టమే.

"ఛీ పాడు పిల్లాడా. నేనెళ్ళిపోతా" అన్నది చిలిపిగా. ముందుకి జరిగి కాళ్ళు మడత బెట్టుకుని చెట్టు నానుకుని కూర్చుంది.

"వెళ్ళద్దు" బతిమాలుతున్నట్టుగా అన్నాడా అబ్బాయి.

"ఉత్త...నే" అలలా నవ్వింది ఆ అమ్మాయి.

"ఆ నవ్వే నా కిష్టం. ఆనవ్వే మనిద్దర్నీ కలిపింది కదూ" అన్నాడా అబ్బాయి. ఆ నవ్వు ఎప్పుడు, ఎలా వాళ్ళిద్దర్నీ ఏ రాంనగర్ బస్టాపులో

కలిపిందో, ఏ శ్రీకన్య థియేటర్ డీలక్స్ కౌంటర్లో కలిపిందో, లేకపోతే ఏ జూలాజికల్ పార్కులో కలిపిందో, ఏ పాంచీచ్ కలిపిందో జ్ఞాపకంచేసుకుంటున్నట్లుగా ఆ అమ్మాయి చెట్టుకి తలాన్చి, నీలం చీరలా ఉన్న ఆకాశం వేపు ఆ చీర మీద పువ్వుల్లా ఉన్న పక్షుల వేపు చూస్తూంది.

ఆ అబ్బాయి ఆ అమ్మాయి పాదాలకున్న వెండి పట్టీలవేపు చూస్తూ, ఆ పాదాల అందం, వాటికి పట్టీలు ఇచ్చే రెట్టింపు అందాన్ని చూస్తూ కూర్చున్నాడు.

అదే సమయంలో ఎక్కణ్ణించొచ్చిందో కండచీమ ఆ అమ్మాయి పాదాలవేపు జోరుగా, హుషారుగా నడుస్తూంది. కాస్సేపట్లో అది ఆ అమ్మాయి సుతిమెత్తని పాదాల్ని కరవ్వచ్చు. దానికి ఆ సుకుమారమైన అమ్మాయి బాధ పడచ్చు. ఆమె బాధని చూడలేని ఆ అబ్బాయి ఆ కండ చీమను పట్టి, కసితీరా ఏ పార్టుకి ఆ పార్టు వూడదీసి నవ్వుతూ చంపేసి ఆ అమ్మాయి వేపు చూశాడు.

"చంపేశావా" అన్నదా అమ్మాయి.

నిన్ను కుడుతుంది. అందుచేతే. నీ నవ్వుని తప్ప నీ బాధని నేను చూడలేను" అన్నాడా అబ్బాయి మామూలుగా.

"మంచి పని చేశావు" అన్నది ఆ అమ్మాయి వెటకారంగా.

"ఏం?"

"అయినా అది నీ కేంచేసింది? అది నన్ను కుట్టడానికే వస్తుందని నీకెలా తెలుసు. నువ్వు పట్టి చంపెయ్యకపోతే తన దారిని తాను పోయేదేమో! ఛీ. నువ్వలా అనవసరంగా చీమను చంపేశావు. అదెంత బాధ పడిందో. తాను చచ్చిపోయే ముందు ఎంత నిస్సహాయంగా అరిచిందో, ఎంత విలవిల్లాడిందో నువ్వూహించ గలవా. అలాటి నోరు లేని జీవుల్ని చంపడం నా కిష్టం లేదు తెలుసా? దీనిని బట్టి నీ మనస్తత్వం నాకు తెలుస్తూంది. ఎదుటివాళ్ళు బాధ పడుతుంటే దానిని నువ్వు వినోదంగా తీసుకుని ఆనందించ గలవు. అవునా' ' అన్నది. ఆ సమయంలో ఆ అమ్మాయి ముఖం ఎందుకో ఎర్రగా అయింది. కళ్ళల్లో ఏదో అదీ ఇదీ తెలీని భావం కనిపించింది ఆ అబ్బాయికి. దానికి కారణం తను చీమను చంపడం వల్లనే వచ్చిందని తెలుసుకున్నాడు. ఆ తరవాత ఆ అబ్బాయికి సరదా వేసింది. సంతోషం అనిపించింది.

"ఎంత సున్నితం ఈ అమ్మాయి మనసు" అనుకున్నాడు. ఆ మాటే అన్నాడు ఆమెతో.

"ఇలాంటివి ఈసారి చేస్తే వూరుకోను" అన్నది.

ఆ తర్వాత మళ్ళీ మామూలే. ఇద్దరూ చేతులూ చేతులు కలుపుకుని భీమిలి రోడ్లమ్మట, దారిలో పోయే పల్లెటూరి వాళ్ళని అల్లరిచేస్తూ, ఆకతాయిగా తిరిగారు. కొబ్బరితోటలో బాగా కాయలున్న చెట్టెక్కి ఆ అబ్బాయి రెండు కొబ్బరి కాయల్ని తెంపి తెస్తే, వాటిని కష్టపడి బద్దలు కొట్టుకుని త్రాగుతున్నప్పుడు తోటమాలి వస్తే, వాడిచేత చీవాట్లు తిని, డబ్బులిచ్చేసి రోడ్డు మీద కొచ్చి విరగబడి నవ్వుకున్నారు. కుచ్చిళ్ళ నెత్తుకుని ఆ అమ్మాయి కెరటాల్లో చిన్న పిల్లలా గెంతుతున్నప్పుడు 'నాకు దొరక్కుండా నువ్వు తప్పించుకో చూద్దా మని ఇద్దరూ ఇసకమీద పరుగెట్టి పరుగెట్టి అలసిపోయి అలసిపోయి ఒకరి ఒళ్ళో ఒకరుపడుకుని ఆయాసం తీరేవరకూ గడిపారు. నిర్మానుష్యంగా ఉండే భీమిలి నృశింహస్వామి కొండపై నుంచి ఒకర్ని ఒకరు గట్టిగా పట్టుకుని పిచ్చిగా అరిచారు.

అలా, అలా సాయంత్రం వరకూ భీమిలంతా తమదే అన్నట్టుగా తిరిగి రాత్రి ఎనిమిది గంటలకు విశాఖ వచ్చేరు. ఆ అమ్మాయి ఆటో ఎక్కి వాళ్ళింటి కెళిపోతుండగా - "మళ్ళెప్పుడు మనం కలియడం.." అని బెంగగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు అబ్బాయి.

"ఎప్పుడు సమయం చిక్కితే అప్పుడు... ఆఁ..." ఎవరికీ కనబడకుండా ఆ అబ్బాయి కో ముద్దునిచ్చేసి గబుక్కున ఆటో ఎక్కేసింది. ఆటో వాల్తేరు అప్‌లాండ్స్ రోడ్డెక్కివెళ్తుంటే, అ అబ్బాయి ఆసీలు మెట్ట జంక్షన్లో అటే చూస్తూ నిల్చున్నాడు.

ఆ అబ్బాయి పేరు శ్రీపతి. ఆ అమ్మాయి పేరు చంప.

★ ★ ★

అరెకరం పొలంలో వేసిన పూలమొక్కలు అందంగా ఉన్నాయి. మొక్కలే కాదు, వాటికి పూసిన పువ్వులు కూడా వాటికున్న అందంతో మిలమిల్లాడుతున్నాయి. పూల మొక్కలే కాదు, రకరకాలక్రోటాన్సు మొక్కలు, రెండు జామచెట్లు, మూడు నిమ్మ చెట్లు ఉన్నాయక్కడ.

నిమ్మచెట్టు నీడన వో అమ్మాయి, వో అబ్బాయి నిల్చున్నారు. వాళ్ళ చేతుల్లో దారాలున్నాయి. వాళ్ళు ఎంచక్కగా పూసిన పువ్వుల్లాగా ఉన్నారు. వాళ్ళిద్దరూ పూలబొమ్మల చొక్కా, గౌనులు వేసుకున్నారు.

"ఒరే, పాలబాబీ, చూడ్రా, ఆ గులాబీ పువ్వు మీద... నువ్వు జాగ్రత్తగా ఆ జామచెట్టు పక్క నుంచి వెళ్తే నీకు దొరుకుతుంది." అన్నదా అమ్మాయి.

పాలబాబీ తల వూపాడు.

"అది కాదే, బేబీ. ఆ ప్రక్కన అదిగో... అదిగో... గడ్డి గులాబీ మీద... వెళ్ళు - ఎవరు వేగిరం పడతారో."

పాలబాబీ హుషారుగా ముందుకి పరుగెత్తాడు. బేబీ కూడా ముందుకి నడిచింది. జాగ్రత్తగా, ఏమాత్రం శబ్దం చేయకుండా దారాన్ని జాగ్రత్తగా జారుముడి వేసుకుని ఇద్దరూ రెండు తూనీగల్ని అతి చాకచక్యంగా పట్టేసారు.

పట్టేసి "హ..హ.." అని గర్వంగా నవ్వుకుని "పద మామయ్య దగ్గరి కెళ్దాం" అని కూడ బలుక్కుని మామయ్య దగ్గర కొచ్చారు.

"మామయ్యా .. పట్టలేవన్నావ్, చూడు" అని గర్వంగా రెక్కలు కొట్టుకుంటూ, విలవిల్లాడుతూ దారానికి వ్రేలాడుతున్న తూనీగల్ని చూపించారు.

శ్రీపతి ఆ సమయంలో చంప వ్రాసిన ఉత్తరాన్ని చదువుతున్నాడు. ఇవాళుదయం పదకొండుగంటలకు వస్తానని అందులో వ్రాసింది.

"హాయ్ ... పట్టేరే... బాగుంది. ఈ సారి రెండేసి పట్టాలి... తెలిసిందా?" ఇద్దరూ పరుగెత్తబోయి ఆగిపోయారు.

గేటు తెరచుకుని వచ్చింది చంప. ఆ సమయంలో నిజంగా ఆ అమ్మాయి సంపెంగ పువ్వులాగే ఉంది. పలకబారిన పండు రంగులో శరీరం - దానికి తోడు సంపెంగ పువ్వు రంగు చీరనే కట్టింది. అదే రంగు ... పువ్వు పెట్టుకుంది.

గబుక్కున కుర్చీలోంచి లేచాడు శ్రీపతి.

"రా... రా... నీ కోసమే చూస్తున్నాను." ఆ అమ్మాయి మెల్లగా నవ్వుతూ ఆ పిల్లలిద్దర్నీ, వాళ్ళ చేతుల్లో దారాలకి కట్టబడి ఉన్న తూనీగల్నీ చూసింది.

"రా... నా గదిలో కెళ్దాం." అతను ముందుకి నడిచాడు. అతని వెనకాతలే ఆ అమ్మాయి నడిచింది. గది చిన్నదైనా డీసెంట్‌గా ఉంది. గదిలో ఒక పేము కుర్చీ, దాని ముందు ఒక టేబిలూ, దాని మీద ఏష్‌ట్రే ఉన్నాయి. దాని కానుకుని ఉన్న కిటికీ అరుగు మీద దువ్వెనా, గంధం పౌడరు, లాక్టో కేలమిన్ మీడియం సైజు బాటిల్, అటూ ఇటూ ఉన్న నాలుగు గోడలకి

మోషన్ బ్రదర్స్ అమ్మాయిల కేలండర్స్ ఉన్నాయి. వెనక షాలిమార్ కేలండర్లో భారతీయ సాంప్రదాయ నాట్యాలన్నీ వరసగా వేయబడి అందంగా ఉన్నాయి. స్తంభానికి ఒక వేపున డబ్బాలో మనీ ప్లాంట్ మొక్క ఎండ తగలక కాబోలు ఎర్రబడిన ఆకులతో ఉంది. గోడకి వరసగా పుస్తకాలు... కాగితాలు... ఏవేవో..

"కూర్చో..." అమ్మాయి కూర్చుంది తన హేండ్ బ్యాగ్‌ని టేబిల్ మీద పెడ్తూ.

"ఇదే నా గది .. సారీ.. మన గది" నవ్వుతూ అన్నాడు శ్రీపతి.

"ఆ పిల్ల లెవరు?" అది వినిపించుకోనట్లు అన్నదా అమ్మాయి.

"వాళ్ళా ... ఇంటివాళ్ళ పిల్లలు."

"వాళ్ళ చేత తూనీగల్ని పట్టించి ఆనందిస్తున్నావన్న మాట. నీలాంటి బుద్ధులు వాళ్ళకీ నేర్పుతున్నావన్నమాట.... " చికాగ్గా అతనివేపు చూస్తూ అన్నది.

అతనేదో చెప్పబోయాడు.

అతను చెప్పే లోపలే -

"అవేం చేసేయి చెప్పు. నోరులేని జీవులు. నువ్వు ఏ హాని చేసినా తిరిగి అవి నీకేమీ చేయవు. నిన్నే ఇంకొకడు కొట్టేడనుకో.. తిట్టేడనుకో. నువ్వూరుకుంటావా? బలముంటే తిరగబడతావ్, లేకపోతే తిడతావు. కానీ... అవి... ఛీ... నీ కా రోజే చెప్పాను. ఇలాంటివి నా కిష్టం లేదని. అలాంటివి చేసేవాళ్ళన్నా, చేయింపించినా ఐ హేట్ దెమ్. నేనా ఫ్రెండ్‌షిప్‌ని కూడా కట్ చేసేస్తానని తెల్సా... ఐ యామ్ ఎ వెరీ వెరీ డెలికేట్ ఎండ్ సెన్సిటివ్ హార్ట్ పర్సన్. ఐ డోంట్ లైక్ దిస్ టైప్ ఆఫ్ మర్డర్స్... యూనో దట్ - దీసీజ్ ఆల్సో ఏన్ అఫెన్స్.." చంప సీరియస్‌గా చెప్తుకెళ్తోంది.

"సారీ... ఎక్స్‌ట్రీమ్లీ సారీ.. ఇలాంటివి ఇంకెప్పుడూ చెయ్యను. నిన్ను బాధపెట్టే విషయాలు నన్ను కూడా బాధ పెడతాయి. నువ్వంటే ఏమిటో ఇవాల్టికి నాకు బాగా తెల్సింది. నిన్నీ వేళే పూర్తిగా అర్థం చేసుకున్నాను. సారీ... డియర్". చంప రెండు చేతులూ పట్టుకుని తన బుగ్గలకానించుకుని తర్వాత దగ్గరగా తీసుకుని నుదురు మీదా, జుత్తు మీదా ముద్దు పెట్టుకున్నాడు.

తర్వాత వాళ్ళిద్దరూ చాలా మాట్లాడుకున్నారు. ఈ మధ్య ఆమె కో

రెండు సంబంధాలొచ్చాయంట. ఇప్పుడప్పుడే పెళ్ళిచేసుకోనని, తనకి డేన్సర్‌గా మంచి పేరు ప్రఖ్యాతు లొచ్చాక అప్పుడు పెళ్ళి చేసుకుంటానని చెప్పిందట.

"ఎందుకు అలా చెప్పానో తెల్సా..."

"ఎందుకట?"

"నే నెప్పుడు పెళ్ళి చేసుకున్నా... నిన్నే చేసుకుంటాను గనుక" అతని నడుం చుట్టూ చేతులువేసి అతన్ని గట్టిగా వాటేసుకుంటూ అన్నది.

"ఉండు, ఎవరైనా చూస్తారు... తలుపు తెరిచే ఉంది." గాభరాగా అన్నాడు శ్రీపతి. లేచి తలుపులోపల గడియపెట్టి ఇద్దరూ చాప మీద కూర్చున్నారు. శ్రీపతి చంప జుత్తునీ, కళ్ళనీ, బుగ్గల్నీ, నుదుటి మీదా మెడమీదా.. వరసగా ముద్దులు పెట్టుకుంటున్నాడు. చంప గట్టిగా అతన్ని వాటేసుకుంటూ తన్మయతతో మెలికలు తిరిగిపోతోంది. శ్రీపతి చంపని నెమ్మదిగా ఆక్రమించుకొంటూ మీది కొరిగాడు.

"వెల్తురు..." అన్నది ఆ అమ్మాయి. గది కిటికీ సందుల్లోంచి బైటి వెల్తురు లోనికి వస్తోంది.

"వెల్తురు నీకిష్టం లేదా?" లేదన్నట్టు గోముగా తలూపింది. వెళ్ళి ఒక న్యూస్ పేపర్ తలుపు దగ్గర అడ్డుపెట్టి వచ్చాడు. ఇప్పుడు మసక చీకట్లో వాళ్ళిద్దరే మిగిలారు.

★ ★ ★

ఆ నెల్రోజుల్లో చాలాసార్లు ఆ మసక చీకటిని వాళ్ళిద్దరూ చూశారు.

ఇది జరిగాక మూణ్ణెల్ల తర్వాత వరకూ వాళ్ళిద్దరూ కలియలేదు. శ్రీపతి జీవిత చర్యలో ఏం మార్పు లేదు. కానీ ఇన్నాళ్ళూ ఖాళీగా తిరిగేవాడు. కానీ ఇప్పుడు ఒక ట్యుటోరియల్ కాలేజీలో పార్ట్ టైమ్ లెక్చరర్‌గా చిరుద్యోగం దొరికింది. ఆమాత్రానికే అతనికి చాలా ఆనందం వేసింది. చంపని కలిసి ఆ విషయమే చెబుదామనుకున్నాడు. కానీ ఆకస్మాత్తుగా చంపే కల్సింది.

విశాలాంధ్ర బుక్‌స్టాల్లో కృష్ణంరాజు కథల్ని కొనుక్కొని బైటకొస్తున్నాడు.

"హాయ్... శ్రీ..నీకోసమే.. నీ రూమ్ కెళ్ళొస్తున్నాను..." శ్రీపతికి చాలా ఆనందం వేసింది.

"నేనూ నీకోసమే. నీ కో విషయం చెప్పాలి." ఇద్దరూ గౌతమ్ స్వీట్ స్టాల్లో కూర్చుని కోవా తెప్పించుకుని తింటూ తనకు దొరికిన చిరుద్యోగం గురించి చెప్పాడు శ్రీపతి.

"నాకు యుగోస్లావియాలో డేన్స్ ప్రోగ్రాం ఇవ్వటానికి ఆఫరొచ్చింది" సంతోషంతో ఉరకలు వేస్తూ చెప్పింది.

"రెణ్ణెల్లు.. ప్రయాణం... మా డాడీ, నేనూ వెళ్తున్నాం... వరస టూర్లు... వరస ప్రోగ్రాములు."

ఆ మాట విని మవునంగా ఉండిపోయాడు శ్రీపతి.

"ఏం కంగ్రాట్యులేట్ చెయ్యవ్..." విసురుగా అన్నది.

"నిన్ను చూడకుండా ఉండగలనా"

మరి ఈ మూణ్ణెల్లూ నేను కలకత్తాలో ఉంటే నువ్వెలా వున్నావ్?"

"అది వేరు" అన్నాడు శ్రీపతి.

"ఆ బెంగ పడకు ... నే నెప్పుడూ నీ దాన్నే... ఇప్పుడు పూర్తిగా నీదాన్నే ... తెల్సా... ఇప్పుడు నేను ఉత్తి మనిషిని కాదు తెల్సా."

"నిజమా?" ఆశ్చర్యపోయాడు శ్రీపతి.

శ్రీపతి ఒక్కసారి ఇదీ అని తెలీని గమ్మత్తైన అనుభూతిని అనుభవించాడు. తనకు బిడ్డ పుడుతుంది. తను నాన్నౌతున్నాడు. ఎవరైనా చూస్తారని, ఏమనుకుంటారనే భయం, బెంగ లేకుండా చంపని గట్టిగా ముద్దు పెట్టేసుకున్నాడు.

"ఊ...వూ... ఏ...య్..." సిగ్గుతో విడిపించుకుంది.

తర్వాత ఇద్దరూ నడుచుకుంటూ కొత్తసాలి పేట దారి వెంబడి, కె.జి.హెచ్. కలక్టరాఫీస్ ప్రక్కనించి జాలరిపేటలోంచి నడుస్తున్నారు.

"మనకి పాప ఎప్పుడు పుడుతుంది" అన్నాడు శ్రీపతి.

"పాప పుడుతుందా?"

"పాపే పుడుతుంది. పాపకి మాల అని పేరు పెడతాను. అది మన ప్రేమ మాల... అవునా?"

ఏమన్లేదు చంప.

"మరి మన పాప ఎప్పటికి పుడుతుంది." లెక్కలు వేస్తున్నాడు శ్రీపతి నడుస్తూనే.

"సరిగా సెప్టెంబర్ నెల్లో..." ఆగిపోయి చూశాడు. ప్రక్కన చంప లేదు. వెనక్కి చూశాడు.

జాలరి పేట వాళ్ళతో మాట్లాడుతోంది. చుట్టూ జనం మూగారు. గబగబా వెళ్ళి ఏమిటని అడిగాడు.

"చూడు... శ్రీ.... ఆ కుక్కని ఎలా చంపుతున్నారో..." గజ్జిపట్టి అసహ్యంగా సగం తోకతో గట్టు ప్రక్క కూచున్న కుక్కని చూపెడుతూ అన్నది.

"అది కాదు... బాబూ... ఆ కుక్క పిచ్చిది. ఇప్పటికి ఇద్దరు పసిపిల్లల్ని కరిచింది. వాళ్ళ పరిస్థితి ప్రమాదంగా ఉంది. దీన్ని సంపేస్తేనేగానీ పీడా విరగదు." ఒక ఆడమనిషి జవాబు చెప్పింది.

"కుక్క పిచ్చిదట" ఏదో చెప్పబోయాడు శ్రీపతి.

"అయితే చంపుతారా?" కోపంగా అన్నది చంప.

"పోనీలే, పద మన కెందుకు" అన్నాడు.

"యూ ఆర్ టూ సెల్ఫిష్" అని "ఆ కుక్కని వదిలేయ్యండి" అని గబుక్కున పది రూపాయలు తీసి ఆ ఆడమనిషి చేతిలో పెట్టి మూలన పడుకున్న కుక్కవేపు ఒకసారి చూసి కమాన్ అని ముందుకు నడిచింది చంప.

జాలరివాళ్ళు ఆశ్చర్యంగా చూస్తున్నారు వాళ్ళిద్దర్నీ.

ఇద్దరూ అలా నడుచుకుంటూ రామకృష్ణా పార్కువరకూ వచ్చి పిల్లల రైలు బండిలో కూర్చున్నారు.

"అయితే నీ ప్రయాణం ఎప్పుడు"

"వచ్చే నెల ఇరవై ఆరు" అన్నది చంప.

"నువ్వు తిరిగొచ్చే లోపల నేను మంచి ఉద్యోగం సంపాదించుకుంటాను. అప్పుడు మనిద్దరం హాయిగా ఉండొచ్చు... అవునా."

ఇద్దరూ ఉప్పూకారం కలిపిన మామిడిముక్కలు కొనుక్కొని తింటూ, నడుచుకుంటూ బస్టాపు దగ్గర కొచ్చారు.

"మళ్ళెప్పుడు కలియడం?"

"మరి ఇప్పట్లో కలియను. నేను డాన్స్ రిహార్సల్స్‌కి హైదరాబాద్ వెళ్తున్నాను. అట్నించలాగే ప్రయాణం. ఉత్తరాలు వ్రాస్తాను." శ్రీపతి చెయ్యి పట్టుకుని అన్నది.

శ్రీపతి ఆటో పిల్చాడు.

ఎక్కబోతూ, ఆగిపోయి అన్నది చంప.

"నీకో విషయం చెప్పడం మరిచాను. అపర్చునిటీస్ రేర్‌గా వస్తాయి. వాటిని ఉపయోగించుకోవాలి. పిల్లలకి ఇప్పుడేం తొందర? పెళ్ళయ్యాక వద్దన్నా పుడతారు. మరి ఇప్పుడు ... ఇలా నేను డాన్స్ ఎలా చెయ్యగలను.."

ఆమె చెప్తున్నదేమిటో అర్థం కాలేదు శ్రీపతికి.

"అందుకే ఎబార్షను చేసుకోవాలనుకుంటున్నాను. మా ఫ్రెండు ఒకత్తి ఉందిలే డాక్టరు - చేసేస్తానంది. అది చెప్పాలి గదా. నువ్వేం బాధపడకు" నవ్వుతూ, హుషారుగా నవ్వుతూ, చలాకీగా నవ్వుతూ, ఆటో ఎక్కింది చంప.

శ్రీపతికి తను ఎక్కడున్నాడో తెలియని స్థితి ఏర్పడింది. ఏదో చెబ్దామని, ఏదో అడుగుదామని అనుకున్నాడు. ఏదీ చెప్పలేకపోయాడు. ఏమీ అడగలేకపోయాడు. అతనికి ఒక్కసారి భీమిలిలో తను చంపిన కండచీమ, తన రూమ్ దగ్గర పిల్లలు చంపిన తూనీగలు, జాలరి పేటలోని పిచ్చి గజ్జికుక్క ఎందుకో జ్ఞాపకం వచ్చాయి.

*ఆంధ్రప్రభ వీక్లీ, 7-5-1980*

*